

సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

శబరి.. బుకింగ్

హాట్‌కేక్‌ల్లా టిక్కెట్లు



- నవంబరు 22 వరకు బుకింగ్ క్లోజ్
- ఉదయం 8 గంటలకు టిక్కెట్ కౌంటర్ల వద్ద ఉన్నా ఫలితం శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ కన్‌ఫర్మ్ కాని పరిస్థితి

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌లో అన్ని తరగతుల టిక్కెట్‌లు హాట్ కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయి పోతున్నాయి. రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఏ ఆర్‌పీ)ని 60 రోజులకు తగ్గించడంతో నవంబరు నెల 22వ తేదీ వరకు ఓపెన్ చేసిన అన్నీ తేదీలలో టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి. స్లీపర్ క్లాస్ మొదలుకొని ఫస్టు ఏసీ వరకు కూడా టిక్కెట్‌లు అందుబాటు లేవు. కనీసం వెయిటింగ్ లిస్టులోనైనా బుకింగ్ చేసుకోలేని విధంగా రిగ్రెట్ మెసేజ్ వచ్చేస్తోన్నది. టిక్కెట్ల కోసం చాలా మంది తెల్లవారు జామునే సమీపంలోని బుకింగ్ కౌంటర్ల వద్దకు వెళ్లి నిరీక్షిస్తున్నారు. ఆధార్ ప్రామాణీకరణ కలిగిన ఐఆర్‌సీటీసీ యూజర్లు మొబైల్ ఫోన్లు/కంప్యూటర్ల ముందు లాగిన్ అయి కూర్చుంటున్నా టిక్కెట్ బుకింగ్ కావడం లేదు. దీంతో శబరిమలకు ఎలా వెళ్లాలోనని మథన పడుతున్నారు. ఇక భారం అంతా స్పెషల్ ట్రైన్‌ల పైనే వేసి అయ్యప్ప మాలధారణల కు సిద్ధమౌతున్నారు.

ఏటా అక్టోబరు నెల నుంచి ఎక్కువ మంది అయ్యప్ప భక్తులు మాలధారణ చేస్తుంటారు. వీలుని బట్టి 45 రోజుల నుంచి 60 రోజుల పాటు దీక్ష (మిగతా 6వ పేజీలో)

ఆస్తిపన్నుపై.. కసరత్తు

20 శాతం ఆదాయం పెంపే లక్ష్యం

రూ.52 కోట్లు పెరగాలి..

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను ద్వారా వార్షిక ఆదాయం ప్రస్తుతం రూ.258.95 కోట్లుగా ఉంది. ఈ మొత్తంపై 20 శాతం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఈ ప్రకారం మున్సి పాల్టీల్లో ఆదాయం సుమారు రూ.52 కోట్లు పెరుగుతుందని అంచనా.

- గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్ సహా జిల్లా పరిధిలోని మున్సిపాల్టీలలో ఆస్తి పన్ను వార్షిక ఆదాయం రూ.185.31 కోట్లు ఉంది. 20 శాతం పెరగాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు 37.06 కోట్లు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.
- పల్నాడు జిల్లాలో ఆస్తి పన్ను ఆదాయం రూ 47.01 కోట్లు. రూ.9.40 కోట్లు పెరగాల్సి ఉంది.
- బాపట్ల జిల్లాలో ఆస్తి పన్ను 26.63 కోట్లు ఉండగా రూ.5.32 కోట్లు ఆదాయం పెరగాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

- పట్టణాల్లో రెండో విడత ఇంటింటి సర్వే
- మున్సిపాల్టీల్లో చేజారిన ఆదాయాలపై దృష్టి
- పన్నుపోటు లేకుండా ఆదాయం పెంపునకు లక్ష్యాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో పన్ను పెంచకుండా ఆదాయ వనరులను పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్నుల ఆదాయం మరో 20 శాతం పెరగాలని లక్ష్యం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై పురపాలకులు దృష్టి సారించారు. ఈ క్రమంలో చేజారిన పన్నులను తిరిగి రాబట్టుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆస్తి పన్నుల ఆదాయాన్ని పెంచుకునేందుకు సర్వే చేస్తున్నారు. తొలివిడత సర్వే సక్రమంగా జరగలేదని భావించిన డీఎంఏ మరో సారి ఆస్తి పన్ను సర్వేకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెండో సారి ఆస్తి పన్ను పునః పరిశీలనకు ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను వచ్చే 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడికక్కడ మున్సిపాల్టీల్లోని సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సర్వే చేస్తున్నారు. సర్వే జరుగుతున్న తీరుపై డీఎంఏ వారాంతపు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు చెక్ పడేనా..

మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. ఈ పన్ను మదింపులో గతంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. పన్నులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. భవనం.. ఖాళీ (మిగతా 6వ పేజీలో)



డీఎస్సీ సభకు ఏర్పాట్లు

- వెలగపూడిలో 25న నియామక పత్రాల పంపిణీ
- ఏర్పాట్లలో లోపం ఉండకూడదన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు(వెలగపూడి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన వారికి ఈ నెల 25న నియామకపత్రాల పంపిణీ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయం వద్ద ఎన్- 9 రోడ్డు పక్కన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయనున్నారు. వర్షాల నేపథ్యంలో 19న జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. అయితే 25న నిర్వహణకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మూడు భారీ జర్మన్ వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాకపోకల మార్గాలు, స్టేజి, బారీకేడింగ్ పనులతో పాటు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ సెక్రటరి కోన శశిధర్, డైరెక్టర్ విజయ్ రామరాజు, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.



భీమలింగేశ్వర స్వామి ఆలయంలో వైష్ణవి దేవి అలంకారంలో పార్వతీ దేవి అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు

నరసరావుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పాతూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి మంగళవారం కౌమారి అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారికి మహేశ్వరి అలంకారం చేశారు. సత్తెనపల్లి రోడ్డులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, రామిరెడ్డిపేట చౌడే శ్వరి అమ్మవారి దేవాలయం, పాతూరులోని చౌడేశ్వరి దేవీ ఆలయం, మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

యూరియా కొరత రాకూడదు

- ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి
- ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలి
- సమీక్షలో అధికారులను ఆదేశించిన కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత రాకుండా సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి ఆయా అధికారులతో కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉద్యాన, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాల ని ఆదేశించారు. రాయితీ పథకాల అమలును విస్తృతం చేయాలన్నారు. రైతుసేవా కేంద్ర సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు పంటల సరళి గురించి గ్రామస్థాయిలో సిబ్బంది వివరించాలన్నారు. ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసార పరీక్షా ఫలితాల ఆవశ్యకతను రైతులకు పర్చాలన్నారు. గ్రామస్థాయిలో అధికారిని నియమించుకుని, రైతుసేవా కేంద్ర సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ కౌలు రైతులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. సాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాల్వల చివరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ సూరజ్‌ధనుంజయ్

గ్రామస్థాయిలో తెలియపరచాలన్నారు. కిసాన్ డ్రోన్లను ఉపయోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో బ్లాక్ బార్లీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించినందున గ్రామాల్లో రైతులకు వ్యవసాయశాఖ సిబ్బంది తెలియ భూములకు కూడా సాగునీరు అందించాలన్నారు. వ్యవసాయశాఖ జేడీ ఎం జగ్గారావు, ఉద్యాన అధికారి ఐ వెంకటరావు, గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ ఝాన్సీ, సూక్ష్మ సేద్యాధికారి ఆంజనేయులు, వ్యవసాయాధికారి అమలకుమారి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

25 నుంచి పీహెచ్‌సీ వైద్యుల సమ్మె

- కలెక్టర్‌కు నోటీసు ఇచ్చిన ఏపీపీహెచ్‌సీడీఏ

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కాని పక్షంలో గురువారం నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ మమతాప్రియ, కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీ హె చ్‌సీడీఏ) ఆధ్వర్యంలో కలెక్టర్ కృతికాశుక్లాకు మంగళవారం ముందస్తు నోటీసు అందజేశారు. సమ్మె కార్యాచరణను ప్రకటించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. సమ్మె కారణంగా వైద్య సేవల్లో అంతరాయం కలిగితే అందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందని వారు పేర్కొన్నారు.

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 586.50 అడుగులు ఉంది. ఇది 302.91 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3549 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,495 క్యూసెక్కులు, 12 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు, 14 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 2,93,262 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 3,42,506 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నా రు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 3,42,506 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

మిస్టరీ వీడిన పెదకాకాని యువకుడి హత్య కేసు

యడ్లపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులే కాలయములుగా మారి గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన తాడిబోయిన గోపి(32)ని హత్య చేసిన కేసులో ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. చిలకలూరిపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. ఈ ఏడాది జూన్ 25న యడ్లపాడు నక్కవాగు సమీపంలో జాతీయరహదారి సర్వీసు రోడ్డు పక్కన కాల్వలో గుర్తుపట్టలేనట్లు కాలిపోయిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మృతుడు గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన తాడిబోయిన గోపి(32)గా గుర్తించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన గోపి హత్యకు ముందు వరకు సిలిస్టియాన్ క్రియేషన్స్ బ్యానర్ పేరుతో మిషన్ మంగళాద్రి అనే వెబ్ సిరీస్ తీస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో గుంటూరులో క్యాటరింగ్ సర్వెంట్‌గా పనిచేసే ఆఫ్రిన్‌తో గోపి సన్నిహితంగా ఉండేవాడు. ఆమె తమ్ముడు ఇమ్రాన్‌తో కూడా గోపికి పరిచయం ఏర్పడింది. అయితే ఆఫ్రిన్‌తో సన్నిహితంగా ఉండే గోపి ఇమ్రాన్ ప్రేమించిన యువతిని వేధిస్తున్నాడు. దీంతో వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ కారణంతో గోపిని హతమార్చి అతడి వద్ద నగదు కాజేయాలని ఇమ్రాన్ పథకం వేశాడు. అందుకు తన స్నేహితులైన షేక్ రియాజ్, ఖాజామొహినుద్దీన్‌ల సహాయం కోరాడు. దీంతో జూన్ 24న ఫోన్‌చేసి గోపిని తాను అద్దెకు ఉంటున్న గదికి ఇమ్రాన్ రప్పించాడు. గదికి వచ్చిన గోపిని స్నేహితులతో కలిసి రాడ్‌తో కొట్టి మెడకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి 25న తెల్లవారుజామున యడ్లపాడు వద్ద కాల్వలో పడేసి పెట్రోల్‌తో నిప్పంటించి వెళ్లిపోయారు. ఈ కేసుకు సంబంధించి తొలుత ఆధారాలు లభించలేదు. దీంతో సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించిన పోలీసులు ముగ్గుర్ని సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచిహత్యకు వినియోగించిన రాడ్, గోపికి చెందిన ఫోన్, ఏటీఎం కార్డు, 12 వేల నగదు, నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 15 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ సుబ్బనాయుడు, సహకరించిన ఎస్ఐ శివరామకృష్ణతోపాటు సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

- నిర్వహణను పట్టించుకోని నిర్వాహకులు
- ప్రిన్సిపాళ్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని గుత్తేదారు
- సురక్షిత తాగునీరు అందక విద్యార్థులు అవస్థలు



గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేయని ఆర్వో ప్లాంట్

మరమ్మతులు మరిచారు

కళాశాలల్లో అటకెక్కిన ఆర్వో ప్లాంట్లు

వినుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కళాశాలల్లో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.లక్షలతో ఆర్వో ప్లాంట్లు నిర్మించారు. అయితే నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆర్వో ప్లాంట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. మరమ్మతులు గురించి నిర్వహణ సంస్థ పట్టించుకోక పోవడంతో పలు కళాశాల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. మరమ్మతుల గురించి గుత్తేదారు పట్టించుకోక పోవడంతో విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందించడం కాగితాలకే పరిమితమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వం జూనియర్ కళాశాలలు 21 పైగా ఉండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు నేడు పేరుతో ఒక్కో ఆర్వో ప్లాంట్లను రూ.3 లక్షలకుపైగా వ్యయం చేసి నిర్మించారు. పదివేల లీటర్లకు పైగా పరిశుభ్రమైన తాగునీరు అందించేలా వీటిని ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్లను ఐదేళ్ల పాటు గుత్తేదారు సంస్థ నిర్వహించాలి. అయితే ప్లాంట్లు ఏర్పాటు చేసి రెండున్నరేళ్లు కూడా కాలేదు. అయినా అనేక కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. కొన్నిచోట్ల వైరింగ్, ప్లంబింగ్ సమస్యలతో పాటు సాంకేతిక సమస్యలతో ప్లాంట్లు అటకెక్కాయి. సకాలంలో మరమ్మతు లు చేయాల్సిన కాంట్రాక్టు సంస్థ పట్టించు కోవడంలేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమస్యలపై ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నా గుత్తేదారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్లాంటు ఉన్నా పరిశుభ్రమైన తాగునీరు అందక విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరులోని వృత్తి విద్య జూనియర్ కళాశాల, బాలి కల జూనియర్ కళాశాలలో ప్లాంట్లు మూడు నెలల నుంచి పనిచేయడం లేదు. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాలకు వచ్చిన సమయంలో కూడా ప్లాంట్ల పరిస్థితి గురించి విద్యార్థులు, అధ్యాపకులు ఫిర్యాదులు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అనేక కళాశాలలో ఆర్వో ప్లాంట్లు పరిస్థితి ఇదే విధంగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్లాంట్ల మరమ్మతుల గురించి ఉన్నతస్థాయిలో అధికారులు స్పందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



ట్యాప్ ల వద్ద అపరిశుభ్ర వాతావరణం

శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు
- ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక

హోరాహోరీగా 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్

ఏపీ పీజీసెట్‌లో 9,892 సీట్లు భర్తీ 6లో..

దీక్షతో.. పాఠం 8లో..
- చదివి వినేలా యాప్ రూపకల్పన
- పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్‌తో అవకాశం

హోరాహోరీగా జాతీయ చెస్ చాంపియన్‌షిప్


చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీలను ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కే జగదీష్ పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీలను ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తోంది. చిన్న చిన్న సంచలనాలు మినహా, ఎక్కువ మంది అగ్ర క్రీడాకారులు మూడో రౌండ్‌లోకి సులభంగా అడుగుపెట్టారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు లలిత్ బాబు, తమిళనాడుకు చెందిన అయుష్ రవికుమార్‌పై గెలుపొంది మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. వీరి మధ్య పోటీ ఆసక్తికరంగా జరిగింది.

26న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వారధి ఇండియా ఫౌండేషన్ స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న పరీక్షా భవన్లో ఈ నెల 26న జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయి విజేతలను గైడ్ టీచర్ల సహాయంతో జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపాలని సూచించారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా (7842869407), అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమ్య (98665 53230) తదితరులను సంప్రదించాలని సూచించారు.


శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు

- దసరా తర్వాత అమ్మకాలు, ధర పెరిగే అవకాశాలు
- ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరం చుట్టుపక్కల ఉన్న శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు నిల్వవున్నట్లు తాము వివరాలు సేకరించామని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఆంధ్రజ్యోతి సంచికలో మంగళవారం 'గుంటూరు మిర్చిపై దసరా ఎఫెక్ట్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సెక్రెటరీ స్పందించారు. ప్రస్తుతం విపరీతమైన వర్షాలు కురుస్తుండటం, మిర్చిలో తేమ శాతం పెరగడం, రవాణా ఇబ్బందుల వలన బంగ్లాదేశ్‌కు ఎగుమతులు తగ్గాయన్నారు. ఈ ప్రభావం మిర్చి అమ్మకాలపై ఉందన్నారు. పండగ సెలవుల అనంతరం అమ్మకాలు, ధరలు పెరగొచ్చని ఎగుమతి, దిగుమతి వ్యాపారస్థులు తెలిపారని పేర్కొన్నారు. ఏటా దసరా నవరాత్రుల సందర్భంలో ఈ పరిస్థితి తలెత్తుందన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

- దిగువకు 3 లక్షల 97 వేల 250 క్యూసెక్కులు
- డెల్టా కాలువలకు 13 వేల 769 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి భారీగా పెరిగింది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 4 లక్షల 11 వేల 019 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3 లక్షల 97 వేల 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈ రాజేష్ తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 8242 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులు వదులు తుండగా, గుంటూరు ఛానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజికి వరద ఉధృతి భారీగా పెరుగుతుండడంతో దిగువ నదీతీర ప్రాంతాల వాసులు, లంకభూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 37.50 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, 12 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 3,551,168 క్యూసెక్కుల నీరు, మొత్తం 3,68,168 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

పశ్చిమడెల్టాకు 5527 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 5527 క్యూసెక్కునీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 4,11,019 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 1513 క్యూసె క్కులనీరు, తూర్పుకాల్వకు 415 క్యూసెక్కులనీరు పశ్చిమకాల్వకు 237 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 423 క్యూసెక్కులనీరు, కొమ్మ మూరుకాల్వకు 2140 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

విద్యుదుత్పత్తి నిలిపి వేత

రెంటచింతల,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 3,26,146 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కే వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబులు చెప్పారు. ప్రాజెక్టుకు వున్న 20 గేట్లకు 14 క్రస్ట్ గేట్లను 4 మీటర్లు, 2 గేట్లను 3.5 మీర ఎత్తామన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 3,26,838 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.63 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.4880 టీఎంసీలకు సమానమన్నారు.

దిగువకు 3,97,250 క్యూసెక్కుల వరద నీరు విడుదల

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

కొల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 3,97,250 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు 3.84 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయగా ఎగువ నుంచి వరద ఉధృతి ఎక్కువ కావడంతో ఆరున్నర సమయంలో 3,97,250 క్యూసెక్కులు దిగువకు విడుదల చేయడంతో పాటు తూర్పు, పశ్చిమ ప్రధాన కాల్వలకు కూడా మరో 13,769 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 5.67 లక్షల క్యూసెక్కుల వరద నీరుకు మించితే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.


దోనేపూడి వద్ద చప్టాపై పారుతున్న వరద నీరు

ఏఎన్‌యూలో స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్


హ్యాకథాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం "స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్ 2025"ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంగాధర రావు మాట్లాడుతూ యువత తమలోని ప్రతిభను, పారిశ్రామిక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఈ వేదిక ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య, సమన్వయకర్త సూర్యకామేశ్వరి, ప్యానల్ సభ్యులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమతో పాటు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏపీ పీజీసెట్‌లో 9,892 సీట్లు భర్తీ

2025-26 విద్యా సంవత్సరానికిగానూ మొదటి కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులకు పీజీ ప్రవేశాలు (ఏపీ పీజీసెట్-2025) కేటాయించినట్లు పీసీ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య రవికుమార్ మంగళవారం తెలిపారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు 11,401 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వెబ్ ఆప్షన్ అనంతరం 9,892 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఈ నెల 27లోపు వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ ర్యాంకులు ఆధారంగా పారదర్శకంగా జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక క్యాటగిరీల ప్రవేశాలు, మొదటి దశ కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి రెండోదఫా కౌన్సెలింగ్‌ను త్వరలో నిర్వహిస్తామని కన్వీనర్ ఆచార్య రవికుమార్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడు ఝున్నుసాహెబ్‌కు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



యడ్లపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అందమైన చేతిరాతకు ప్రాణం పోస్తూ.. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుడు ఝున్నుసాహెబ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఒకే నెలలో మూడు అవార్డులను కైవసం చేసుకుని జిల్లాలోనే హ్యాట్రిక్ అవార్డు గ్రహీతగా నిలిచారు. మండలంలోని కొండవీడు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఝున్నుసాహెబ్ విద్యార్థులలో చేతిరాత నైపుణ్యాలను పెంపొందించడంలో విశేష కృషిచేస్తున్నారు. కేవలం తమ పాఠశాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందంగా రాయడం(కాలిగ్రఫీ)లో శిక్షణ ఇస్తూ తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ప్రతిసారీ ఆయా పాఠశాలలకు వెళ్ళి శిక్షణ ఇవ్వడం సాధ్యం కానందున విద్యార్థులతో పాటు అక్కడి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలలకు సెలవుదినాల్లో వెళ్లి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ నెలలో వరుసగా మూడు అవార్డులు వరించాయి.సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆయనను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. ఈ నెల 7న విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్‌థెరెస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఏటా అందించే గురు బ్రహ్మ అవార్డును ప్రదానం చేసింది. తాజాగా హైదరాబాద్‌కు చెందిన శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతిష్టాత్మకంగా అందించే నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్-2025 అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు. వినూత్న బోధనా పద్ధతులతో విద్యాబోధన, వర్క్‌షాపులు నిర్వహిస్తూ విద్యా సేవలు అందిస్తున్న ఝున్నుసాహెబ్‌కు వరుసగా అవార్డులు లభించడం పట్ల సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

శబరి..బుకింగ్

(5వ పేజీ తరువాయి)

చేసి ఇరుముడులతో అయ్యప్పస్వామిని దర్శించుకొనేందుకు బయలుదేరు తుంటారు. దాదాపుగా ఒక రోజంతా ప్రయాణ సమయం ఉండటంతో ఎక్కువ మంది రైళ్లలోనే వెళ్లేందుకు ప్రాధాన్యం కనబరుస్తుంటారు. అయితే గుంటూరు మీదగా శబరిమలకు వెళ్లే ఒకే ఒక్క రైలు శబరి ఎక్స్‌ప్రెస్. ఇది సికింద్రాబాద్‌లో బయలుదేరి ఉమ్మడి గుంటూరు జిల్లాలో నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుం టూరు, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల మీదుగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం నం బరు. 17230గా ఉన్న సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి నంబరు. 20629 సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌గా మారబోతు న్నది. ఈ కారణంగా టైంటేబుల్‌ని కూడా మార్పు చేశారు. 28వ తేదీ వరకు ప్ర స్తుత కాలమానపట్టికలోనే ప్రయాణిస్తుంది. 29వ తేదీ నుంచి మాత్రం సికింద్రా బాద్‌లో మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరు, రాత్రి 7.33కి తెనాలి, 7.53కి నిడుబ్రోలు, 8.13కి బాపట్ల, 8.28కి చీరాల, మరుసటి రోజు మధ్యాహ్నం 2.12కి కొట్టాయం, 2.55కి చెంగనూరు, సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టించుకొని మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొని ఈ రైలులో బయలుదేరే విధంగా టైంటేబుల్ ఉండ టంతో ఇందులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ మీద గా శబరిమలకు వెళ్లే రైళ్లు ఉన్నప్పటికీ అవి దూర ప్రాంతాల నుంచి వచ్చేవి. ప్రస్తుతం తత్కాల్ కోటా టిక్కెట్‌లు ఎలాగైతే హాట్‌కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతాయో శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఏ రోజుకు ఆ రోజు ఉదయం 8 గంటలకు బు కింగ్ ఇలా తెరవగానే అలా అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రద్దీ రోజులను బట్టి టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్)లను శబరిమలకు నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఆస్తి పన్నుపై.. కసరత్తు

(5వ పేజీ తరువాయి)

స్థలం కొలతలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే పన్ను ఎంతో తెలుస్తుంది. ఈ విధానంలో అక్రమాలు జరగవని భావించినా కొన్ని మున్సిపాల్టీల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేశారు. దీంతో పన్ను తక్కువగా నమోదైందని కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. నివాస భవనాన్ని వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు ఉన్న భవనంపై కట్టడాలు కూడా ఉన్నాయి. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో అధికార పలుకుబడితో పలువురు పన్నులను తగ్గించుకున్నారు. ఇలాంటి అక్రమాలపై దృష్టి సారించాలని పురపాలకులను డీఎంఏ ఆదేశించింది. దీంతో ఆ లోపాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. అన్ అసైన్డ్.. అండర్ అసైన్డ్ భవనాలను కూడా గుర్తిస్తున్నారు.

తిరుపతి ఎక్స్‌ప్రెస్ తాత్కాలికంగా ధర్మవరం వరకు పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు - తిరుపతి - గుంటూరు మధ్యన ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైలుని వచ్చే నెల నుంచి ధర్మవరం వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయించింది. అక్టోబరు 1వ తేదీ నుంచి నంబరు. 17261 గుంటూరు - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. ఈ రైలు తిరుపతికి చేరుకొన్న తర్వాత పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె, ములకలచెరువు, కదిరి మీదగా ఉదయం 9 గంటలకు ధర్మవరం చేరుకొంటుంది. అక్టోబరు 2వ తేదీ నుంచి నంబరు. 17262 ధర్మవరం - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. ఈ రైలు మధ్యాహ్నం 1.20కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై తిరుపతికి రాత్రి 7.15కి చేరుకొని 7.25కి బయలుదేరుతుంది. ప్రస్తుతం వలే మరుసటి రోజు ఉదయం 7.20కి గుంటూరు చేరుతుంది. ఈ మార్పు నవంబరు 30వ తేదీ వరకు అమలులో ఉంటుంది.

ప్రపంచ తెలుగు మహాసభలకు గోవా గవర్నర్‌కు ఆహ్వానం


గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గజల్ శ్రీనివాస్, రామచంద్రరాజు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యం లో వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహా సభల ఆహ్వాన పత్రికను గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతి రాజుకు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, సమన్వయకర్త పీ రామచంద్రరాజులు అందజేశారు. జనవరి 5వ తేదీన ఉదయం 10 గంటలకు మహాసభలలో భాగంగా జరిగే ఆంధ్ర వైభవం సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు సాహితీ, సాంస్కృతిక, సేవా రంగ ప్రముఖులకు ఆంధ్ర శ్రీ, ఆంధ్ర సారస్వత భూషణ, ఆంధ్ర సారస్వ త రత్న పురస్కారాలను అందజేసి తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించాలని గవర్నర్‌ను కోరారు. ఈ సందర్భంగా గవర్నర్ సానుకూలంగా స్పందించారని గజల్ శ్రీనివాస్ తెలిపారు.

బీఫార్మసీ పరీక్షలను పరిశీలించిన సమన్వయకర్త సుబ్బారావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బీ-ఫార్మసీ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్షలను మంగళవారం పీజీ, వృత్తివిద్య కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరిశీలించారు. విశ్వవిద్యాలయం క్యాంపస్ ఫార్మసీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్షలు జరిగే తీరును చూశారు. ఆయన విద్యార్థుల హాల్ టికెట్లు, జవాబుపత్రాలు తదితర వాటిని పరిశీలించారు. అలాగే పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని ఆయన పరీక్షా కేంద్రం నిర్వహకులకు సూచించారు.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

మంగళగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కొత్తపేటలో సుమారు ఏడేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా మూడో ఏడీజే కోర్టు న్యాయమూర్తి సీ వెంకట నాగశ్రీనివాసరావు తీర్పు చెప్పారు. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎర్రబాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి వెంకట రమణ (43), కొత్తపేటకు చెందిన మోటుకూరి భాస్కరరావులు 2019, ఫిబ్రవరి 8వ తేదీన రాత్రి పదిన్నర గంటల సమయంలో ఎర్రబాలెంలో మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోగా, అర్ధరాత్రి రమణ కొత్తపేటలోని భాస్కరరావు నివాసానికి వెళ్లి మరోమారు గొడవకు దిగాడు. దీంతో కోపోద్రిక్తుడైన భాస్కరరావు ఇంట్లోని కుట్టుమిషన్‌పై వున్న కత్తెరతో రమణను పొట్టలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రమణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి సీఐ సీహెచ్ రవిబాబు నిందితుడు భాస్కరరావును అరెస్టు చేసి న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో జిల్లా మూడో ఏడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముబీనా బేగం వాదనలు వినిపించగా, న్యాయమూర్తి వెంకట నాగశ్రీనివాసరావు ముద్దాయి భాస్కరరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పినట్టు మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపారు.

స్కూటీ అదుపుతప్పి ఒకరి మృతి

చేబ్రోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద మంగళవారం జరిగింది. ప్రముఖ ధార్మికవేత్త తబ్లిగ్ జమాత్ పొన్నూరు మండలం అమీర్(ఇన్‌ఛార్జి)గా వ్యవహరిస్తున్న మగ్బుల్ జానీ(74) భార్య షంషాద్ బేగంతో కలిసి స్కూటీపై వెళుతుండగా నారాకోడూరు సమీపంలో స్కూటీ వెనుక టైర్ బరస్ట్ కావడంతో అదుపుతప్పి రోడ్డుప్రమాదానికి గురయ్యారు. షంషాద్ బేగంకు స్వల్పగాయలుకాగా, తీవ్రంగా గాయపడిన మగ్బుల్ జానీని స్థానికులు వడ్లమూడిలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

పసుపు రైతులకు వ్యాపారి టోకరా

రూ. 3 కోట్ల వరకు సరుకు కొని పత్తా లేకుండా పోయిన వ్యాపారి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పసుపు రైతులకు వ్యాపారి టోకరా వేశాడు. సుమారు మూడు కోట్ల రూపాయల వరకు సరుకులు కొని పత్తా లేకుండా పోయాడని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. హుబ్లీలో ఉండే ఒక వ్యాపారి రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన బ్రోకర్ ద్వారా సత్తెనపల్లి మండలం అబ్బూరు, లక్కరాజు గార్లపాడు, రాజుపాలెం మండలం గణపవరం, వినుకొండ, ఫిరంగిపురం మండలాల్లోని పలు గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్‌లో సుమారు 15 మంది రైతుల వద్ద నుంచి పసుపును కొనుగోలు చేశారు. కొనుగోలు అనంతరం కొద్ది రోజుల్లోనే నగదు చెల్లిస్తానని బ్రోకర్ ద్వారా రైతులను మభ్య పెట్టాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడు ఫోన్ చేసిన సమాధానం దాట వేస్తున్నాడని, గట్టిగా నిలదీసే సరికి రెండు నెలలుగా వ్యాపారి ఫోన్ స్విచ్ఛాప్ చేశాడని బాధిత రైతులు వాపోయారు. బ్రోకర్‌ను అడిగినా ఏ సమాధానం చెప్పకుండా మిన్నకుండి పోతున్నాడన్నారు. దీంతో రైతులు చేసేది లేక పోలీసులను ఆశ్రయించారు. ఎవరెవరు ఎంత పసుపు అమ్మింది, ఎంత మొత్తం రావాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను వారు వేడుకున్నారు. ఐతే ఈ విషయాన్ని పోలీసులు మాత్రం ధృవీకరించటం లేదు. బాధిత రైతులు ఇంకా ఎక్కువ మొత్తంలో ఉండే అవకాశం ఉందని రైతులు చెపుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

30,716 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 32,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 30,716 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,794 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14300	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13800	334	10500	14500
273	----	----	నెంబరు. 5	10000	14000
341	10000	14800	273	----	----
4884	----	----	341	10000	15000
సూపర్ 10	----	----	4884	10000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14600	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15000
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

పల్నాడు వార్తలు

25న రణభేరి మహాసభ

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యాన ఈనెల 25వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రణభేరి మహాసభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే ఖాసీంపీరా, జిల్లా ప్రధాన కార్యదర్శి జి విజయసారధి, రవి చంద్రశేఖర్, ఎస్‌కె జమాల్, డి శ్రీనివాసరావు, ఎంవి సాంబశివరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● **మాచర్ల రూరల్** : పట్టణంలోని సెయింట్ ఆన్స్ బాలికల పాఠశాలలో 39 యేళ్లుగా ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మల్లిపెద్ది అరుణ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం అరుణ దంపతులను దుశ్శాలువలతో సన్మానించి జ్ఞాపికను అందించారు.

● **దుర్గి** : మండలంలోని ఓబులేశునిపల్లెలో మంగళవారం ఏవో అమీర్‌రెడ్డి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంట పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. కౌలు రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించి కౌలు రైతు కార్డు పొందాలన్నారు. పంట నమోదు ప్రక్రియ ఈనెలాఖరుతో ముగుస్తుందన్నారు.

● **గురజాలటౌన్** : గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మండలంలోని చర్లగుడిపాడు గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యాన పోషణ్ మహ్ ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి** : మండలంలోని పట్లవీడు ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం ఉప్పల పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యాన స్వస్థ నారీ - స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. 150 మంది మహిళలకు బీపీ, షుగర్ పరీక్షలు జరిపారు. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు

● **అమరావతి** : స్వస్థ నారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మంగళవారం ఉదయం మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన వైద్యశిబిరంలో 124మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ మౌనిక తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లీలాప్రసాద్, కిల్కారి పిఓ రాజు వైద్యసిబ్బంది పాల్గొని సేవలు అందించారు.

● **సత్తెనపల్లి రూరల్** : మండలంలోని పెద మక్కెన గ్రామంలో 104 వాహనం అందిస్తున్న సేవలను రీజనల్ మేనేజర్ కలీం మంగళవారం తనిఖీ చేశారు. గ్రామంలో ప్రజలకు వాహన ద్వారా లభించే అన్ని రకాల సేవలను పటిష్ఠంగా అమలయ్యే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు.ఆయనతో పాటు డాక్టర్ కవిత, సూపర్ వైజర్ దావీదు, ఇతర సిబ్బంది సుధాకర్, కోటేశ్వరరావు, భాగ్యలక్ష్మి, రత్న ప్రభ తదితరులు పాల్గొన్నారు.

● **పిడుగురాళ్ల** : ప్రతి పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ గ్రామస్తుల సమన్వయంతో పంచాయతీల ఆదాయం పెంచుకునేందుకు వనరులు ఏర్పరుచుకోవాలని ఎంపీడీవో కే వాణి తెలిపారు. పిడుగురాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

● **రెంటచింతల**: సత్రశాల వద్ద గల కృష్ణానదిలో ఎవరి పరిధిలో వారు చేపల వేట షికారు చేయాలని అనవసర వివాదాలకు తల దూర్చవద్దని ఎస్ఐ సీహెచ్ నాగార్జునకోరారు. మంగళవారం స్టేషన్ ఆవరణలో మత్స్యకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం టెయిల్ పాండ్ ప్రాజెక్టు గేట్లనుంచి లక్షల క్యూసెక్కుల నీరు విడుదలవుతున్న సందర్భంగా ఎవరూ చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.ముందస్తు చర్యల్లో భాగంగా ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహశీల్దార్ మేరీ కనకం ముందు హాజరుపర్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

● **క్రోసూరు** : గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరుల పై దృష్టి సారించాలని రిసోర్స్ పర్సన్ పీ శిరీష అన్నారు. క్రోసూరు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సొంత ఆదాయ వనరుల పై శిక్షణా కార్యక్రమం మంగళవారం రెండవ రోజు ముగిసింది. కార్యక్రమానికి ఎంపీడీవో జీ శ్రీనివాసరావు ఆధ్వర్యం వహించారు.కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఉమా మహేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రామ పంచాయతీ ఉద్యోగులు శిక్షణకు హాజరయ్యారు.

● **క్రోసూరు** : స్వస్థ్ నారి కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుడిపాడు, పెరికపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని కార్యక్రమానికి హాజరైన ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు అన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, ఇతర ఆరోగ్య సిబ్బంది కార్యక్రమంలో వైద్య సేవలు అందించారు.

● **దుర్గి** : మండల కేంద్రమైన దుర్గి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఆస్తి, వృత్తి, వినోద, ప్రకటన, విద్యుత్, వాహన పన్నులపై ప్రజలకు అవగాహన కల్పించి ఆదాయం పెంపొందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ నాగులునాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


● **అచ్చంపేట** : ఆస్పత్రి సిబ్బంది సమన్వయంతో పని చేసి రోగులకు సేవలు అందించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతితో పాటు ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు అందించారు. సమావేశ మైన వారిలో క్రోసూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రాయిడి సాంబశివుడు, తాళ్ళూరి సుబ్బారావు, తిరువాయిపాటి ఆంజనేయులు, ఎస్‌కే కాసుల, భూక్యా రమేష్ నాయక్, బుచ్చిబాబు, చంటి తదితరులు పాల్గొన్నారు.

● **దాచేపలి** : గామాలపాడు గ్రామ సచివాలయంలో స్వచ్ఛత పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కాంద్రగుంట కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ముఖ్య అతిధులుగా జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, గ్రామ సర్పంచ్ జంగా సురేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్లులు హాజరయ్యారు. మహిళా సాధికారిత సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

● **నకరికల్లు** : ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సత్తెనపల్లి డీఎల్‌డీవో వై రాజగోపాల్ అన్నారు. మంగళవారం ఆయన నకరికల్లులో మాట్లాడుతూ స్వామిత్వ సర్వే, కౌశలం సర్వే, హౌస్‌హోల్డ్ సర్వేలను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

బెల్లంకొండ మండల టీడీపీ అధ్యక్షుడిగా వెంకట రామిరెడ్డి

బెల్లంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండల టీడీపీ అధ్యక్షునిగా టీడీపీ సీనియర్ నాయకుడు, మన్నె సుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన అక్కల వెంకట రామిరెడ్డిని నియమితులయ్యారు. మంగళవారం గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో బెల్లంకొండ మండల అధ్యక్షునిగా అక్కల వెంకట రామిరెడ్డిని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. అక్కల వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ తనకు పదవి సహకరించిన ఎమ్మెల్యే ప్రవీణ్, గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకట రామిరెడ్డికి మండల టీడీపీ నాయకులు మస్తాన్ షరీఫ్, ఓర్చు ఆనంద్, ఆసుల జగన్, గుడిసె కొండయ్య, డాక్టర్ హనుమంతరావు, వర్ల వెంకటేశ్వర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



వెంకట రామిరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వైద్యాధికారి అనిల్‌కుమార్ తదితరులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వస్థనారీ - స్వశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సంజీవరెడ్డి నగర్‌లో గల ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతి మహిళకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన స్వస్థనారీ - స్వశక్తి పరివార్ కార్యక్రమం రూపొందించినట్లు మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ శిబిరంలో 254 మంది హాజరుకాగా వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు అనిల్‌కుమార్, ఎం నస్రీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్, పట్టణ ఇన్‌చార్జి ఆదినారాయణ, టీడీపీ నేతలు నాగమల్లేశ్వరరావు, పల్లపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో నిబద్ధతతో పని చేయాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు నిబద్ధతతో పని చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం ఉదయం బెల్లంకొండ మండల ముఖ్య నాయకులతో గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంకొండ మండలంలో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ప్రజల మెప్పు పొంది కూటమి అభ్యర్థి గెలుపొందేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని సూచించారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో నియోజక వర్గంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం నుంచి వెంకటాయపాలెం వెళ్ళే జిల్లా పరిషత్ రోడ్డు గత మూడు దశాబ్దాల నుంచి గుంతల మయంగా తయారైందని, గత వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో తట్ట మట్టి కూడా వేయలేదని, జిల్లా పరిషత్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే రోడ్డు నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, అక్కల వెంకట రామిరెడ్డి, అక్కల సుబ్బారెడ్డి, పీఎస్‌కే రసూల్, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఆసుల జగన్, ఓర్చు ఆనంద్, మేళం శ్రీరామ్మూర్తి, శ్రీను నాయక్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు భవిష్యత్‌కు సంకెళ్లు

● ఈగల్ సెల్ ఎస్ఐ రాజీవ్ కుమార్

రెంటచింతల,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటితో జీవితం నాశనమవుతుందని ప్రజల్లో చైతన్యం కల్పించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఈగల్ సెల్ ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ అన్నారు. మంగళవారం పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో నిర్వహించిన డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలను సేవిస్తే వచ్చే అనర్థాలను వివరించారు. మత్తు పానీయాలకు దూరంగా ఉంటామని ఉద్యోగులు, కార్మికులు చేత ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు, డీజీఎం మల్లికార్జున పాల్గొన్నారు.

అమరావతి-బెల్లంకొండ రహదారికి నిధులు కేటాయించాలి



మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమరావతి నుంచి బెల్లంకొండ వెళ్ళే రహదారికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మంగళవారం సచివాలయంలో కలసి ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం ఆగి పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వైసీపీ పాలనలో రోడ్డు నిర్మాణం మాటలతోనే సరి పెట్టి పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపునకు సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు.

నేడు బహిరంగ వేలం

నకరికల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని కల్యాణ మంపడంలో జరుగు ఫంక్షన్‌లకు, ఎలక్ట్రికల్ డెకరేషన్‌కు, పూలు డెకరేషన్‌లకు బుధవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో బండి శ్రీనివాసులు తెలిపారు. అలాగే ఫంక్షన్‌లకు వంట పాత్రలు, షామియానాలు, కుర్చీలు అద్దెకు ఇవ్వటానికి ఈ వేలం పాట నిర్వహించను న్నట్టు తెలిపారు. వివరాలకు 9010759937. 7013511824 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

రెంటచింతల,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తరహాలో విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులను సంస్థలో విలీనం చేసి డైరెక్ట్ పేమెంట్ ఇవ్వాలని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కార్యదర్శి ఎండపల్లి సుబ్బారావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆరవ రోజైన మంగళవారం టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు మెయిన్ గేట్ ముందు కార్మికులంతా మోకాళ్ల మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘ అధ్యక్షులు ధర్మారావు,సుగుణరావు,అమర్‌నాథ్‌రెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల మార్పుల పై తగు చర్యలు తీసుకోవాలి

● తహసీల్దార్ కే పుల్లారావు

నకరికల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా 2025లో 35 సంవత్సరాల వయస్సు దాటి ఉన్న వారి వివరాలను 2002 ఓటర్ల జాబితాలో ఉన్నట్లయితే వారి వార్డు నెంబరు, సీరియల్ నెంబరు, పోలీసు స్టేషన్ నెంబర్లు నమోదు చేయాలని తహసీల్దార్ కే పుల్లారావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యల పై సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ తుమ్మా కొండారెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

143 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం గ్రామంలో మంగళవారం స్వస్థ నారీ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రవితేజ నాయక్ సుమారు 143 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అయుష్ వైద్యులు శ్రీనివాసరావు సాధారణ ఆరోగ్య పరీక్షలు గర్భాశయ క్యాన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు, రక్తహీనత, ఎనీమియా పరీక్షలు, సికిల్ సెల్ పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు ప్రసూతి పరీక్షలు, కౌమార దశలో ఉన్న బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత గురించి తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



వాసవీ అమ్మవారి దేవాలయం వద్ద బతుకమ్మలతో మహిళలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకొని పట్టణంలోని అన్ని దేవాలయాల్లో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, కనకదుర్గమ్మ దేవాలయం, బొడ్రాయి వద్ద మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయం, కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కూర్మావతారం, షిర్డిసాయి మందిరం, భగవాన్ సత్యసాయి మందిరం, గంగమ్మగుడి, శివాలయం, నాగులు గుడిలో దసరా పండుగ సందర్భంగా అమ్మవారులను వివిధ రూపాల్లో అలంకరించారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కుంకుమపూజ కార్యక్రమాలతో పాటు మహిళలు బతుకమ్మ ఆటలు ఆడి పాటలు పాడారు. అలాగే గుత్తికొండ బిలంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలోనూ అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద మహిళలు అధిక సంఖ్యలో కుంకుమపూజలో పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి** : శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వెంకటపతి కాలనీలో కొలువై ఉన్న శ్రీ నీలంపాటి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని మంగళవారం గాయత్రి దేవిగా అలంకరించారు. పట్టణంలోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో కూడా అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కూడా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వడ్డవల్లి బొడ్డు రాయి సెంటర్‌లో అమ్మవారిని వేద గాయత్రి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



సత్తెనపల్లిలో అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించిన చిత్రం

● **రెంటచింతల** : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజైన మంగళవారం వివిధ ఆలయాల్లో అమ్మవారు గాయత్రిమాతగా,పార్వతిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. జంక్షన్‌లో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అన్నదానం చేశారు. ఆయా ఆలయాల చైర్మన్లు ఏచూరి సాంబశివరావు, కేవి నాగేశ్వరావు, గుండా వెంకట శివయ్య, పెద్దిశెట్టి, ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● **కారంపూడి** : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అలాగే అంకాళమ్మ అమ్మవారు శ్రీబాల త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. షిర్డీ సాయి సత్యసాయి దేవాలయంలోను, చెన్నకేశవస్వామి ఆలయంలోను కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రధాన అర్చకుడు వలివేటి శ్రీనివాసశర్మ, చెన్నకేశవస్వామి ఆలయంలో కమండూరి సత్యనారాయణచార్యులు, వాసవీ ఆలయ అధ్యక్షుడు హనుమంతురావు, మాజీ అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, సత్యసాయి దేవాలయంలో తుమ్మేపల్లి నాగేశ్వరరావు, వెచ్చ వరలక్ష్మణరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● **బెల్లంకొండ** : మండల కేంద్ర మైన బెల్లంకొండలోని శ్రీ మహాలక్ష్మీదేవి నిలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మహాలక్ష్మీదేవి శ్రీ గాయత్రి మాతగా భక్తులకు దర్శన మిచ్చారు.

● **అచ్చంపేట** : అచ్చంపేటలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని వాసవి కన్యకా పరమేశ్వరిగా అలంకరించారు. పూజారులు గుంటూరు బాలరామాచార్యులు, గుంటూరు సురేష్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సూరె వీర వెంకట మణికంఠ, సూరె వెంకట సుబ్బారావు, సూరె రామలింగస్వామి, అనుమోలు శేషగిరిరావు తదితరులు ఆలయంలో కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. కాగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయంలో రెండవ రోజు అమ్మవారిని ఆదిలక్ష్మిగా అలంకరించారు.

● మాచర్ల : పట్టణంలో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి దత్తు ప్రత్యేక పూజలు జరిపారు. ● విజయపురిసౌత్‌లో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక మెయిన్ బజారులోని కనకదుర్గ అమ్మవారు మంగళవారం శ్రీగాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. దుర్గ భవాని యూత్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మాచర్లలో గాయత్రిదేవి అలంకరణలో శ్రీవాసవీ అమ్మవారు

● **క్రోసూరు** : క్రోసూరులోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు అమ్మవారు గజలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని అనంతరం కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బాల త్రిపుర సుందరి దేవిగా అమ్మవారు దర్శన మిచ్చారు.

● **రాజుపాలెం** : దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండలంలోని రాజుపాలెం, గణపవరం తదితర గ్రామాలలో ఉన్న దేవాలయాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి భక్తులు విశేష పూజలు చేశారు. రెండవ రోజు శ్రీ గాయత్రీ దేవిగా అమ్మవారు పూజలందుకున్నారు.

● **దాచేపల్లి** : శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం దాచేపల్లిలోని శ్రీ వీర్లంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● **పెదకూరపాడు** : మండలంలోని పలు గ్రామాల్లో వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పెదకూరపాడులోని బొమ్మలగుడి రామాలయంలో అమ్మవారిని గాయత్రి మాతగా అలంకరించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. మండలంలోని అన్నపూర్ణాంబిక సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. ఆలయాల్లో సామూహిక దేవీ సహస్ర నామ పారాయణ, భజన గీతాలు ఆలపించారు. పెదకూరపాడు, 75 తాళ్ళూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

● **నకరికల్లు** : దసరా శరన్నవాత్రి ఉత్సవల్లో భాగంగా మంగళవారం నరసింగపాడులోని గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో కౌమారి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. చేజర్ల గంగా భ్రమరాంబ పార్వతి సమేత కపోతేశ్వర స్వామి దేవాలయంలో కౌమారి అలంకారంలో గంగా భ్రమరాంబ పార్వతి అమ్మవారు భక్తులకు దర్శన మిచ్చారు. పూజా కార్యక్రమాలను పమిడి శ్రీనివాస శర్మ, కొండకావూరి వెంకట్రామయ్య శర్మలు నిర్వహించారు.

ఆనంను కలసిన ఎమ్మెల్యే కన్నా



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం సచివాలయంలో కలిశారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన పలు దేవాలయాల అభివృద్ధి, ఇతర కీలకాంశాల పై చర్చించారు.

పల్నాడులో క్రీడాకారులకు ప్రోత్సాహకం

● యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాటి ప్రాంతంలో క్రీడాకారులకు కూటమి ప్రభుత్వంలో మంచి ప్రోత్సాహకం ఉంటుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ అన్నారు. నిఖిల్ పుట్టిన రోజును పురస్కరించుకొని గత వారం పిడుగురాళ్లలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం పట్టణంలోని షాదీఖానాలో యరపతినేని నిఖిల్, పార్టీ శ్రేణులు నగదు ప్రోత్సాహకం, షీల్డ్‌లను అందజేశారు. నిఖిల్ మాట్లాడుతూ పల్నాడు క్రీడాకారులను చైతన్య పరిచేందుకు ప్రతి యేడాది క్రీడా పోటీలను నిర్వహించడం మనందరి బాధ్యత అన్నారు. మొదటి బహుమతిని జానపాడు గణేష్ సీసీ టీంకు ఉన్నం వెంకటరావు రూ.40 వేలు, రెండో బహుమతి యరపతినేని వారియర్స్ టీంకు ఉన్నం సైదారావు రూ. 30 వేలు, మూడో బహుమతి బాయ్స్ లెవెల్స్ టీంకు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు రూ.20 వేలను అందించారు. విజేత టీంలకు లెక్కల వెంకటేశ్వర్లు (ఎల్‌వీఆర్) షీల్డ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, మల్లెల ఆదినారాయణ, ఉన్నం వెంకట్రావు, సురేష్, ఎల్వీఆర్, ఏఎంసీ చైర్మన్ వీరాస్వామి, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, షేక్ బాబావలి, ముప్పన వెంకటేశ్వర్లు, కామిశెట్టి రమేష్, కోట హరి, వడ్డవల్లి సాంబశివరావు, బత్తుల శ్రీను, మల్లెల రాజేష్ పాల్గొన్నారు.



క్రికెట్ పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న యరపతినేని నిఖిల్, పార్టీ శ్రేణులు

124 మందికి వైద్యసేవలు

అమరావతి : స్వస్థ నారీ స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మంగళవారం ఉదయం మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన వైద్యశిబిరంలో 124 మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ మౌనిక తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లీలాప్రసాద్, కిల్కారి పిఓ రాజు వైద్యసిబ్బంది పాల్గొని సేవలు అందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెల్దుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా ఆఫీసర్ రవీంద్ర అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో డెంగీ, మలేరియా వంటి కేసులు నమోదు కాలేదన్నారు. ఆయన వెంట వైద్యులు యోగేశ్వరి, లక్ష్మీప్రసన్న ఉన్నారు.


నేటి నుంచి ఆధార్ క్యాంపు

దాచేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి మండలంలో బుధవారం నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. 24న ఉదయం రామాపురం సచివాలయంలో శ్రీనగర్, పొందుగుల, సాయంత్రం నుంచి గామాలపాడు సచివాలయంలో 25న కేసానుపల్లి సచివాలయంలో పెదగార్లపాడు, తక్కెళ్ళపాడు, కేసానుపల్లి, 26న మాదినపాడు సచివాలయంలో ఎస్ అగ్రహారం, కొత్తూరు, సాయంత్రం భట్రుపాడు సచివాలయంలో భట్రుపాలెం, కాట్రపాడు, 27వ తేదీ ఉదయం ముత్యాలంపాడు, సాయంత్రం తంగెడ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నకరికల్లు ఎస్ఐగా సతీష్

నకరికల్లు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు ఎస్ఐగా కన్నెబోయిన సతీష్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సతీష్ మాచవరం, దుర్గి, నాదెండ్ల, నరసరావుపేట-2 టౌన్‌లలో ఎస్ఐగా పని చేశారు. నకరికల్లు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.


నరసరావుపేట : శృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారికి కౌమారి అలంకారం


పెదకాకాని : గాయత్రీ దేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు


అమరావతి : బాలాత్రిపురసుందరీ దేవిగా బాలచాముండికా అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు

అమరావతి/నరసరావుపేట/పెదకాకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అలయాలకు తరలి వచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండో రోజు బాలచాముండికా సమేత అమరావతి అమరేశ్వరాలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఆలయ మొదటి ప్రాకారంలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారిని కూడా పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో దసరా ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. నరసరావుపేటలోని శృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారికి కౌమారి అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు పట్టణాలు, గ్రామాల్లో దేవీ మండపాలను ఏర్పాటు చేసి దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

దీక్షతో.. పాఠం

● చదివి వినేలా యాప్ రూపకల్పన
● పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్‌తో అవకాశం

సత్తెనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం బోధించినా కొంతమంది విద్యార్థులకు అర్థం కాదు. టీచర్ అడగాలంటే భయం.. సందేహాలు నివృత్తి చేసుకోవాలంటే బిడియం. పాఠాలు సక్రమంగా విన్నప్పటికీ భయం.. బిడియంతో తెలివైన విద్యార్థులు కూడా పరీక్షల్లో వెనుకబడి పోతున్నారు. దీంతో తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధించినట్లుగానే ఇళ్ల వద్ద విద్యార్థులు పాఠం వినేలా.. అర్థం చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం దీక్ష పేరుతో ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిం చింది. ఈ యాప్ ద్వారా మరోసారి పాఠాలు విని.. చదివి సులువుగా అర్థం చేసుకునే అవకాశం విద్యార్థులకు వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఫోన్‌లో దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పాఠ్య పుస్తకంపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కావాల్సిన పాఠ్యాంశాలు సవివరంగా కన్పిస్తాయి. ఎన్‌సీఆర్‌టీతో పాటు రాష్ట్ర సిలబస్ పాఠాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దివ్యాంగులకు ఆడియో పాఠాలతో పాటు పది వేలకు పైగా డిక్షనరీ పదాలు ఉన్నాయి.



క్యూఆర్ కోడ్‌తో ఉన్న పుస్తకాలు

ఎన్నో ప్రయోజనాలు

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని రకాల పాఠ్య పుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను ప్రచురించింది. దీక్ష యాప్ దాని ద్వారా ఆయా పాఠ్యాంశాలను విద్యార్థులు పూర్తిగా చదువుకుని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా యాప్‌ను రూపకల్పన చేశారు. యాప్ ద్వారా అభ్యసించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన సామర్థ్యం పెరుగుతుంది.

-శ్రీనివాసరావు, ఎంఈవో సత్తెనపల్లి

క్రీడలకు ఉజ్వల భవిష్యత్తు : మంత్రి రాంప్రసాద్ రెడ్డి


మాట్లాడుతున్న క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో 36వ దక్షిణ మండల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల విధానంలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. ఆధునిక సాంకేతికతను క్రీడల రంగానికి జోడించుట ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పలు అథ్లెటిక్ అసోసియేషన్లు, మల్టీ నేషనల్ కంపెనీలు క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమని తెలిపారు. తొలుత అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పతాకాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ పతాకాన్ని శాప్ చైర్మన్ రవినాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ భరణి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, లక్షద్వీప్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల పరిమితి పెంచాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి

చిలకలూరిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో నల్లబర్లీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. జిల్లాలో రైతులు మొత్తం 11 వేల టన్నుల పొగాకును పండించారని ప్రభుత్వ అంచనాగా ఉన్నట్టు ఆయన చెప్పారు. జిల్లాలో రైతుల వద్ద నుంచి తొలుత 1,600 టన్నులు, తర్వాత రైతుల ఒత్తిడితో మరో 500 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, ఇప్పటివరకు కేవలం 2,100 టన్నులు పొగాకును మాత్రమే కొనుగోలు చేసినట్టు తెలిపారు. నెలలు గడుస్తున్నా 20 క్వింటాళ్ల పైబడి పొగాకును పండించిన రైతుల వద్ద నుంచి పొగాకును కొనుగోలు చేయలేదని, కొనుగోళ్ల స్లిప్పులు కూడా ఇవ్వలేదని ఆయన వివరించారు. జిల్లా పరిధిలో కనీసం మరో 2 వేల టన్నుల పొగాకును కొంటే తప్ప రైతులకు ఉపశమనం కలగదని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిబంధనలు సడలించి తక్షణమే పొగాకు కొనుగోళ్లు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై గతంలోనే తాము రైతుల పక్షాన మార్క్ ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించడం జరిగిందన్నారు. తమకు పరిమితికి మించి కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు లేవని, పరిమితి పెంపు ఉత్తర్వులు లేవని అధికారులు చెప్పినట్టు ప్రత్తిపాటి సభద్వారా ప్రభుత్వానికి తెలియచేశారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

వైసీపీ హయాంలో 28 శాతమే పూర్తి

● కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 52 శాతం పూర్తి చేశాం
● పిడుగురాళ్ల మెడికల్ కాలేజీపై అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ నిర్మాణం విషయం లో వైసీపీ అసత్య గ్లోబల్ ప్రచారం చేస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల నిర్మాణ అంశంపై మంగళవారం శాసన సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వం పిడుగురాళ్ల మెడికల్ కాలేజీని కేవలం 28 శాతమే పూర్తి చేసిందని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావటానికి కొద్ది రోజుల ముందు పనులు పూర్తి కాని మెడికల్ కాలేజీని ప్రారంభించేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో 52 శాతం పనులు పూర్తి చేయించామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం కేవలం కేంద్రం నుంచి వచ్చిన నిధులను మాత్రమే మెడికల్ కాలేజీల నిర్మాణానికి వినియోగించారు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించిన దాఖలాలు లేవని అన్నారు. ప్రభుత్వం త్వరితగతిన మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తి చేస్తే పల్నాడు ప్రాంత ప్రజల వైద్య అవసరాలు చాలా వరకు తీరతాయని అన్నారు. గురజాల నియోజకవర్గం కొన్ని మండ లాల్లో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. గురజాల ఆసుపత్రిలో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉందని, దాన్ని వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అసెంబ్లీ లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రిటైనింగ్‌వాల్‌కు.. టెండర్లు


రక్షణగోడ లేకపోవడంతో వరదలకు ముంపునకు గురవుతున్న తాడేపల్లి మహానాడు ప్రాంతం (ఫైల్)

వర్షాలు.. వరదలతో.. కృష్ణమ్మ ఎక్కడ తమను ముంచేస్తుందోనని కరకట్ట ప్రాంతవాసులు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భయంభయంగా గడుపుతుంటారు. వరద వస్తే రోజుల తరబడి ఇళ్లను వదిలేసి సురక్షిత ప్రాంతాలకు తరలి పోతుంటారు. ఇక ఇలాంటి భయాలు.. కష్టాలు వీడేలా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన కుడి కరకట్టకు రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులకు మోక్షం కలిగింది. మూడున్నర దశాబ్దాల నుంచి తాడేపల్లి మహానాడు ఏరియా వాసుల వరదముంపు సమస్యకు విముక్తి లభించేలా మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారాన్ని చూపారు. సీతానగరం రైల్వేవంతెన నుంచి కనకదుర్గా వారధి వరకు సుమారు 1.7 కిలోమీటర్ల పొడవున నదీతీరం వెంబడి కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి రూ.245.18 కోట్లతో జలవనరులశాఖ టెండర్లను ఆహ్వానించింది. కాంట్రాక్టు సంస్థలు వచ్చే నెల 6న ఉదయం పది గంటలలోగా బిడ్లు దాఖలు చేసుకోవచ్చని జలవనరుల శాఖ తెలిపింది. అక్టోబరు చివరికి కాంట్రాక్టు సంస్థకు వర్క్ ఆర్డర్ లభించవచ్చు. నవంబరు లేదా డిసెంబరులో పనులు మొదలై 2027 చివరికి పూర్తయ్యే అవకాశం ఉంది.

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

కృష్ణానదికి వరదలు వస్తే ప్రకాశం బ్యారేజి దిగువన కరకట్ట వెంబడి పేదల నివాసాలు ముంపునకు గురికావడం పరిపాటిగా మారింది. ఈ సమస్య నుంచి విజయవాడ వైపున్న ప్రాంతాలు కొద్దికాలం కిందటే విముక్తి చెందాయి. అయితే ఇటు గుంటూరుజిల్లా వైపు కుడికట్ట వైపున్న తాడేపల్లి మహానాడు ప్రాంతవాసుల కష్టాలు మాత్రం తీరలేదు. గతేడాది నదికి గరిష్ఠస్థాయిలో 11.45 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినప్పటికీ విజయవాడ వైపున్న పేదల నివాసాలకు రక్షణగోడ ఏర్పాటు కారణంగా ఎలాంటి సమస్య రాలేదు. కానీ ఇటువైపు తీరంలో ఉన్న మహానాడు మాత్రం వరదముంపున కు గురై వారం రోజులకు పైగా పేదలు ఇబ్బంది పడ్డారు. ఈ పరిస్థితిని స్వయంగా గమనించిన మంత్రి లోకేశ్ రక్షణగోడను నిర్మించాలని గత ఏడాది సెప్టెంబరులో నిర్ణయించారు. నిర్ణయం తీసుకున్న వెంటనే కార్యాచరణ చేపట్టారు. దీంతో జలవనరుల శాఖ రూ.294.20 కోట్ల అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలను జనవరిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదింపజేసి దానికి సంబంధించిన పరిపాలన అనుమతులకు లోకేశ్ గ్రీన్‌సిగ్నల్‌ను ఇప్పించారు.



రూ.245 కోట్లతో కుడికట్ట పనులు
దిగువ కృష్ణలో 1.71 కిమీ పొడవునా రక్షణ గోడ
మంత్రి లోకేశ్ కృషితో తీరనున్న పేదల కడగండ్లు

పేదల గోడు పట్టించుకోని వైసీపీ

2019-24 మధ్య అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వ హయాంలోనే తాడేపల్లి మహానాడు వైపు కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలనే డిమాండ్లు బలంగా వచ్చాయి. విజయవాడ వైపు రక్షణగోడ నిర్మాణం చేపడుతున్నట్లే తమవైపు కూడ ఆ పనులను జరిపించి తమను రక్షించాలని మహానాడు, సుందరయ్యకట్టవాసులు కోరారు. అయితే వీరిగోడును పట్టించుకోలేదు.


విజయవాడ బాలాజీనగర్ వైపు గతంలో నిర్మించిన కృష్ణానది ఎడమవైపు రక్షణగోడ

రోడ్డును వదిలేయడంతో తగ్గిన వ్యయం

బ్యారేజి దిగువన కుడిమార్జిన్ వెంబడి 0.9 కిలోమీటర్ల నుంచి అంటే సీతానగరం రైల్వేవంతెనల నుంచి 2.61కిలోమీటర్ల వరకు అంటే వారధి వరకు సుమారు 1.71కిలోమీటర్ల పొడవున కాంక్రీట్ రిటైనింగ్‌వాల్‌ను నిర్మించేందుకు జలవనరులశాఖ రూ.245.18 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. అయితే మంత్రిమండలి రూ.294.20 కోట్లకు పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ఫైనల్ టెండరుకు వచ్చేప్పటికి అంచనా వ్యయం రూ.245.18 కోట్లుగా జలవనరులశాఖ తేల్చింది. తొలుత విజయవాడ బాలాజీనగర్ వైపు నిర్మించిన విధంగా రివర్ ఫ్రంట్ పార్కుతో కూడిన రిటైనింగ్‌వాల్‌తోపాటు ఆ పక్కనే 60 అడుగుల సిమెంటు రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ సదరు సిమెంటు రోడ్డు నిర్మాణం వల్ల భవిష్యత్తులో రిటైనింగ్‌వాల్ బలహీనమవుతుందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని వదిలేసి కేవలం రిటైనింగ్‌వాల్, రివర్ ఫ్రంట్ పార్కును మాత్రమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో అంచనా వ్యయం రూ.294.20 కోట్ల నుంచి రూ.245.18 కోట్లకు తగ్గింది.

రిటైనింగ్‌వాల్ అంటే సాదాసీదా కాంక్రీట్‌వాల్ కాదు. 2.2 మీటర్ల వెడల్పుతో బలిష్టంగా నిర్మించనున్నారు. నదికి 12 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చినా చెక్కు చెదరకుండా బలంగా నిలిచి ఉండేలా అత్యంత బలిష్టంగా నిర్మిస్తారు. రిటైనింగ్ వాల్ ప్రకాశం అనకట్టతో సమానంగా వరదపోటును సమర్థంగా ఎదుర్కొనేలా నిర్మించనున్నారు.

..బాహుబలి గోడ

వృద్ధులకు.. వరం

● ప్రయోజనకరంగా సీనియర్ సిటిజన్ కార్డులు ● ప్రచార లోపంతో అందుకోలేక పోతున్న వృద్ధులు

వినుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సులువుగా పొందేలా.. వృద్ధాశ్రమంలో సేవలు అందుకునేలా.. వృద్ధులకు వరంలా.. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులను ప్రవేశపెట్టింది. అనేకరకాల ప్రయోజనాలు ఉన్న కార్డులను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా జారీ చేస్తున్నారు. అయితే ప్రచార లోపం వల్ల వృద్ధులకు ఈ కార్డుల గురించి తెలియడం లేదు.

కార్డు ఇలా పొందవచ్చు...

పురుషులకు 60, మహిళలకు 58 ఏళ్ల నిండితే సీనియర్ సిటిజన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసిన వారికి వారంలో కార్డు మంజూరవుతుంది. జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో వెంటనే పొందవచ్చు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, వయస్సు ధ్రువీకరణకు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. పల్నాడు జిల్లాలో 1.92 లక్షల మంది వృద్ధులకు ఇప్పటివరకు 12290 కార్డులు మాత్రమే మంజూరయ్యాయి.

ప్రయోజనాలు ఇలా..

- సీనియర్ సిటిజన్ కార్డుతో ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్‌లో 25 శాతం రాయితీ.
- దగ్గర ప్రాంతాల్లో తిరిగే బస్సుల్లో 2 రిజర్వ్ సీట్లు
- రైళ్లల్లో లోయర్ బెర్త్‌ల ఎంపికకు ప్రాధాన్యం.
- స్లీపర్ కోచ్‌లో 6, థర్డ్ ఏసీలో 4, సెకండ్ ఏసీలో 3 బెర్త్‌లు రిజర్వ్ చేసుకోవచ్చు.
- నూతన పాస్‌పోర్ట్ కోసం స్లాట్ బుకింగ్ ఫీజులో 10 శాతం రాయితీ.
- ప్రత్యేక క్యూ ద్వారా బ్యాంకుల్లో సేవలు పొందవచ్చు.
- బ్యాంకుల్లో డిపాజిట్లపై అదనపు వడ్డీ లభిస్తుంది.
- ఇన్‌కమ్‌ట్యాక్స్‌లోమినహాయింపు పొందవచ్చు.
- న్యాయస్థానాల్లో కేసుల విచారణ ప్రత్యేక ప్రాధాన్యం. సీనియర్ సిటిజన్స్ లేఖ రాసినా, లేదా వారి తరఫున న్యాయవాది కోరినా ప్రత్యేక విచారణ తేదీలు కేటాయిస్తారు.ఆయా ప్రయోజనాలను దేశవ్యాప్తంగా ఎక్కడైనా నిరాటంకంగా పొందవచ్చు.



సీనియర్ సిటిజన్ కార్డు

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

● నిందితుల్లో వైసీపీ సోషల్ మీడియా నేత


కుంచాల సవీంద్రారెడ్డి (ఫైల్)

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో వైసీపీ సోషల్ మీడియా నేత కుంచాల సవీంద్రారెడ్డితో పాటు మరో నలుగురుని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు పోలీసులు మంగళవారం తెలిపారు. సవీంద్రారెడ్డి వద్ద కిలోన్నర గంజాయి, చిన్నకొండ్రుపాడుకి చెందిన బత్తుల దీవెనబాబు, వెంకటేశ్వర్లు, నాగవేంద్ర, యనమదలకు చెందిన సారధి వద్ద కిలో 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్నకొండ్రుపాడు పొలాల్లో గంజాయి వినియోగంపై అందిన సమాచారంతో సోమవారం పోలీసులు దాడి చేశారు. గంజాయితో ఉన్న బత్తుల దీవెనబాబుతో పాటు గంజాయి తాగుతున్న వెంకటేశ్వర్లు, సారధి, నాగవేంద్ర పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా చిలకలూరిపేటకు చెందిన జస్వంత్, తాడేపల్లి పరిధిలోని ప్రాతూరు వద్ద కారులో గంజాయి విక్రయించే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు దీవెనబాబు పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు ప్రాతూరు వద్దకు వెళ్లగా ఓ కారులోని సవీంద్రారెడ్డిని దీవెనబాబు గుర్తించడంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. కారులో కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకుని సవీంద్రారెడ్డిని ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గానికి చెందిన కుంచాల సవీంద్రారెడ్డి కొద్ది సంవత్సరాలుగా తాడేపల్లిలో నివాసం ఉంటూ బైపాస్ రోడ్డులో హోటల్ డి దేవ్ వద్ద భార్యతో కలిసి చెరుకు రసం స్టాల్ నిర్వహిస్తున్నాడు. చెరుకు రసం స్టాల్ ముసుగులో సవీంద్రారెడ్డి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు అంటున్నారు.

హైకోర్టులో సవీంద్రారెడ్డి భార్య పిటిషన్

తన భర్తను కారులో వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, ప్రశ్నిస్తే పోలీసులమని చెప్పారంటూ సవీంద్రారెడ్డి భార్య హైకోర్టులో మంగళవారం హెబియస్‌కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే సవీంద్రారెడ్డి విషయం తెలియని పీపీ పోలీసులు అదుపులోకి తీసుకోలేదని హైకోర్టుకు తెలిపారు. సవీంద్రారెడ్డిని బుధవారం ప్రత్తిపాడు పోలీసులు హైకోర్టులో హాజరుపరచనున్నారు. కాగా బత్తుల దీవెన బాబును కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. ఇదే కేసులో వెంకటేశ్వర్లు, సారధి, నాగవేంద్రలను పోలీసులుస్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఓటర్ల జాబితా పరిశీలనపై బీఎల్వోలతో సమావేశం

చిలకలూరిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో తహసీల్దార్ హుస్సేన్, మునిసిపల్ కమిషనర్ శ్రీహరిబాబు బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌వోల)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2002 నాటి ఓటరు జాబితా, ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాను పోల్చి చూడాలని అన్నారు. అప్పటి జాబితాలోని ఓటర్లు అందరూ ఈ జాబితాలో ఉన్నారో లేదో పరిశీలించాలని సూచించారు. ఈ పరిశీలనలో తేలిన సమాచారాన్ని ఈ నెల 26 లోగా ఎన్నికల సంఘానికి నివేదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వినుకొండటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలుపుకొని తాగి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఏనుగుపాలెంకు చెందిన పసుపులేటి సుబ్బారావు (34) ఈ నెల 9వ తేదీన అనారోగ్య కారణాలతో కూల్ డ్రింక్‌లో గడ్డి మందు కలుపుకొని తాగాడు. అదే రోజు తెల్లవారుజామున అతనికి వాంతులవడంతో అనుమానించిన బంధువులు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బారావు మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

అనుమానాస్పదంగా ...

వినుకొండ టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పలు పోలీస్‌స్టేషన్‌లలో కేసులు ఉన్న షేక్ ఇబ్రహీం (37) సోమవారం ఏటీఎం కాంపౌండ్‌లోని విరాట్ కాంప్లెక్స్ సమీపంలో స్థానికులకు గాయాలతో తారసపడ్డాడు. అప్పటికే ఒంటి నిండా గాయాలతో కదలని స్థితిలో ఉండటంతో స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ...

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో ఆత్మహత్యకు యత్నించినవ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన చుట్టు బ్రహ్మయ్య (51) సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన అధికారులు బ్రహ్మయ్యను నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రహ్మయ్య మృతి చెందాడు. గ్రామంలో అన్నదమ్ముల మధ్య నెలకొన్న ఆస్తి వివాదం నేపథ్యంలో బ్రహ్మయ్య కొంతకాలంగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

శావల్యాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శావల్యాపురం కొంకేరు వాగు బ్రిడ్జిపై మంగళవారం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కొరత ఉందంటూ వైసీపీ అసత్య ప్రచారం

● పల్లెల నాగిరెడ్డి

రొంపిచర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత ఉందంటూ వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్ కార్యాలయంలో యార్డు చైర్మన్ మొండితోక రాణి, సొసైటీల అధ్యక్షులు ఇంటూరి ప్రసాదు, సూరాబత్తుల రామారావు, పల్లెల వెంకటరత్నారెడ్డి, కుందేటి రామబ్రహ్మం, వడ్లమూడి వెంకట కిషోర్‌తో కలిసి నాగిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. సొసైటీలు, రైతుసేవా కేంద్రాలు, జీడీసీఎంఎస్‌ల ద్వారా 1,319 టన్నుల యూరియాను మండలంలో పార్టీలతో సంబంధం లేకుండా పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో యార్డు చైర్మన్ మొండితోక రాణి, సొసైటీల అధ్యక్షుడు ఐ.ప్రసాదు, ఎస్.రామారావు, పి.వెంకటరత్నారెడ్డి, కె.రామబ్రహ్మం, వి.వెంకట కిషోర్, ఎ.నాగేశ్వరరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు ఎం.అంజయ్య, ఎస్.పాపారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● బొల్లాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఉపాధి పథకానికి సంబంధించి మండలంలో సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు ప్రారంభించాయి. ఈ నెల 23నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు గ్రామాల్లో పనులు పరిశీలించి అక్టోబరు 7న బొల్లాపల్లిలో ప్రజా వేదిక ఏర్పాటు చేయనున్నట్టు ఎస్ఆర్‌పీ ఆవులయ్య తెలిపారు.

● ఈపూరు: మండలంలోని రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా చేసి రైతులకు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి రామారావు తెలిపారు. అగ్నిగుండాల, బొమ్మరాజు పల్లి, కొచ్చర్ల, చిట్టాపురం, కొండాయపాలెం రైతు సేవ కేంద్రాలకు పది టన్నుల చొప్పున 50 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు.

● నాదెండ్ల: ఏఎన్‌యూ లా బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా నర్రా శ్రీనివాసరావు నియమితులయ్యారు. సాతులూరు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు ప్రస్తుతం విశ్వ విద్యాలయ న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు ఎస్సీ కాలనీలో అరుంధతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆర్థికసాయం చేశారు. పేదరికంతో బాధపడుతున్న మేడేపల్లి కోటయ్య, పాపమ్మ దంపతులకు 50 కేజీల బియ్యం, నిత్యావసరాలను ఫౌండేషన్ అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు మంగళవారం అందజేశారు.

వైభవంగా శరన్నవరాత్రి పూజలు


బిస్కెట్ ప్యాకెట్ల అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


రేమిడిచర్లలో గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు


గాయత్రిదేవి అలంకారంలో విప్పర్ల కామాక్షి అమ్మవారు

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకొని నరసరావుపేట మండలంలోని అన్ని గ్రామాల్లో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నరసరావుపేట మండలం ఇసప్పాలెంలో వేంచేసియున్న మహాకాళి అమ్మవారి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారు బ్రహ్మచారిణి దేవి అలంకరణతో దర్శనమిచ్చారు. ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన కన్నుల పండుగగా నిర్వహించారు. కోటప్పకొండ భువనేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాలపాడు రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారు బ్రహ్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు..

● వినుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక బోసు బొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలోని అమ్మవారికి బిస్కెట్ ప్యాకెట్లతో అలంకరించారు. కల్యాణ మండపంలో శ్రీ బాల త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు కొలువుదీరారు. అలాగే పట్టణంలోని లలితాంబిక, కనకదుర్గమ్మ తదితర ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

● బొల్లాపల్లి: మండలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. మండలంలోని రేమిడిచర్ల గ్రామంలో శ్రీ గంగా గౌరీ శంకర్ దేవస్థానంలో అమ్మవారు గాయత్రి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామానికి చెందిన కలవాల జానకి, దుర్గాభవానీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, విప్పర్ల, వీరవట్నం, అన్నవరప్పాడు, వడ్లమూడివారిపాలెం, గోగులపాడు, సంతగుడిపాడు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం రొంపిచర్ల వాసవి అమ్మవారు కౌమారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విప్పర్లలో కామాక్షి అమ్మవారు, గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు.

● శావల్యాపురం: శావల్యాపురంలోని రైల్వేస్టేషన్ దారిలోని నీలంపాటి అమ్మవారి దేవాలయంలో ఆలయ చైర్మన్ మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారికి గాయత్రీదేవి అలంకరణ చేసి అర్చనలు అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. గంటవారిపాలెం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, మావురాల ఎల్లమ్మతల్లి దేవాలయంలో ధర్మకర్త గోనుగుంట్ల ఏడుకొండలు ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

● నూజెండ్ల: మండలంలోని నూజెండ్ల, అప్పాపురం చెన్నకేశవస్వామి దేవాలయాల్లో అమ్మవారు గాయత్రిదేవిగా, వీ అప్పాపురం, రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో మంగళగౌరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


వినుకొండలో కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అరటి పండ్ల అలంకారం


ప్రత్యేక అలంకారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు

● ఈపూరు: దేవి నవరాత్రుల పురస్కరించుకొని మండలంలోని కొచ్చర్ల అంకాల పరమేశ్వరి, ముప్పాళ్ళ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్లను బ్రహ్మచారిని అవతారంలో అలంకరించారు. భక్తులు పూజలు జరిపారు.

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

● కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్లను సాధారణ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఈవీఎం గోడౌన్లకు వేసిన భద్రతా సీళ్లను, సీసీ కెమోరాల పనితీరును, అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డులో ఉన్న పౌర సరఫరాల మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా ఉండాలని, అక్రమాలకు తావు లేకుండా సకాలంలో రేషన్ సరుకులు ప్రజలకు చేరవేయాలన్నారు. తదనంతరం అగ్రికల్చరర్ మార్కెట్ యార్డులో చౌకధరల దుకాణాల పంపిణీ కేంద్రంలో రైతు బజారును ఏర్పాటు చేయడానికి స్థల పరిశీలన చేశారు. పీడీఎస్ బియ్యానికి సంబంధించి, అంగన్‌వాడీ పిల్లలకు, గర్భిణులకు, మధ్యాహ్న భోజనానికి హాస్టళ్ళకు ఇస్తున్న సరుకుల గురించి స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి జయప్రకాష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే మురళీ, ఏడీ మార్కెటింగ్ కేవీఎస్ ఉపేంద్ర కుమార్, పట్టణ మునిసిపల్ కమీషనర్ జశ్వంత్ రావు, నరసరావుపేట తహసీల్దార్ కొలికినేని వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.


ఎంఎల్‌సీ పాయింట్‌లో సరుకులు పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి కే మురళీ తదితరులు

లింగారావుపాలెంలో వైద్య శిబిరం

● 102 మందికి స్క్రీనింగ్ పరీక్షలు

యడ్లపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ స్వశక్తి కుటుంబ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగారావుపాలెం గ్రామంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 102 మంది మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, బాలింతలకు హిమోగ్లోబిన్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ భరద్వాజ్ నేతృత్వంలోని వైద్య బృందం శిబిరానికి హాజరై వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పోషణ మహోత్సవ్- కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాలింతలు, గర్భవతులు, 6 నెలల నుంచి 3 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు అందించాల్సిన పోషకాహారం గురించి అవగాహన కల్పించారు. అనంతరం గర్భవతులకు శ్రీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పున్నారావు, సూపర్‌వైజర్లు భారతి, రాజశేఖర్, ఏఎన్ఎం అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపెద్దలు సుధీర్, రాజేశ్, రాఘవయ్య, శివరామకృష్ణయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి

● పల్నాడు జిల్లా యూటీఎఫ్ కోశాధికారి రవిబాబు

వినుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రాష్ట్రస్థాయి రణభేరి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా యూటీఎఫ్ కోశాధికారి యం.రవిబాబు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు నిర్వహించిన రణభేరి జాతా ముగించి, ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో రణభేరి సభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25న గుంటూరులో జరగబోయే రణభేరి సభలో 26 జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రవిబాబు కోరారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దు

● మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామారావు

శావల్యాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇన్‌చార్జి ఎంఏవో రామారావు అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసిన రైతులందరికీ యూరియాను అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. శావల్యాపురంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, ప్రభుత్వం మన గ్రోమోర్ సెంటర్‌కు 10టన్నులు, వేల్పూరు, పోట్లూరు, కొత్తలూరు, శానంపూడి, మతుకుమల్లి, పిచికలపాలెం రైతుసేవా కేంద్రాలకు 10 టన్నుల చొప్పున మొత్తం 70 టన్నులు యూరియాను అందించిందని తెలిపారు. మండల రైతు సంఘం నేతలు కేవీఆర్ మోహన్‌చంద్, గణపర్తి వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి వెంకయ్య, చిమటా అంజయ్య ఏవోని కలసి సన్న, చిన్నకారు, కౌలు రైతులకు కూడా రైతుసేవాకేంద్రాల ద్వారా యూరియాను అందించాలని కోరారు.

నాటు సారా బట్టీలపై ఎక్సైజ్ సిబ్బంది దాడులు

బొల్లాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడుపాలెం తండా పరిధిలో నాటు సారా తయారీ బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈపూరు, వినుకొండ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, వీరి సిబ్బందితో గ్రామాల్లో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మద్యం తాగేవారు కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, నాటు సారా, కల్తీ మద్యం గురించి ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలన్నారు.

సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి: ఏవో

చిలకలూరిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి అరుణ సూచించారు. పచ్చి రొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకం చేపట్టాలని ఆమె కోరారు. చిలకలూరిపేట మండలం బొప్పూడిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో ప్రవీణ్, తిరుమల, గ్రామ వ్యవసాయ సహాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో మెగా వైద్య శిబిరం


మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ- స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక 100 పడకల ప్రభుత్వాసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఆసుపత్రి అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయించి ప్రహరీ నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధికి ఐఏఎస్ కృష్ణతేజ ఎంతో సహకరించారని చెప్పారు. నాట్కో వైద్య విభాగం డైరెక్టర్ సదాశివరావు, తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వారి సహకారంతో త్వరలోనే చిలకలూరిపేటలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలకు సంబంధించి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు. హృద్రోగ సమస్యలతో బాధపడే పేద రోగులకు స్విమ్స్ ఆసుపత్రిలో రూ.30 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారని ఈ అవకాశాన్ని రోగులు వినియోగించుకోవాలని సూచించారు. కాగా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా వైద్య శిబిరంలో సుమారు 450 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి శ్రీనివాసరావు, డాక్టర్ మారెళ్ళ ఇందిర, డాక్టర్ భవాని, మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

రైతులు నల్ల బర్లీ సాగు చేపట్టొద్దు: ఏవో హరిప్రసాద్

యడ్లపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు సాగును చేపట్టొద్దని రైతులకు ఏవో హరిప్రసాద్ సూచించారు. నల్ల బర్లీ సాగును ప్రభుత్వం నిషేధించిందని ఆయన తెలిపారు. మంగళవారం యడ్లపాడు గ్రామసచివాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, నల్ల బర్లీ పొగాకు సాగు చేపట్టకుండా చూసేందుకు మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జేఎన్‌టీయూ నరసరావుపేటలో టెక్ టుడే ప్రారంభం

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్‌టీయూ నరసరావుపేట కళాశాలలో ఐఈఈటీఈ అనుసంధానంతో ఈసీఈ విభాగంలో మంగళవారం టెక్ టుడే-25 కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ ఆన్ ఐవోటీ, పేపర్ ప్రెజెంటేషన్, సర్క్యూట్ కార్నివాల్ వంటి టెక్నికల్ ఈవెంట్‌లను, ఈ స్పోర్ట్స్ వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ కిషోర్‌బాబు, ఐఈటీఈ కో-ఆర్డినేటర్ ఏ రాధ, సూడెంట్ వైస్ చైర్మన్ లలిత్, సెక్రటరీ అను, వివిధ ఈవెంట్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అనంతపురంలో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2025 అనంతపురం జిల్లాలోని ఆర్‌డీటీలో జరుగుతాయని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకుడు నాగ మల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం నరసరావుపేట పట్టణంలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతిక శుక్లా, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

విఠంరాజుపల్లిలో స్వచ్ఛ రథం ప్రారంభం

వినుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విఠంరాజుపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం స్వచ్ఛ రథాన్ని ఎంపీడీవో పుల్లారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ రథం వద్దకు వచ్చి ప్లాస్టిక్ వస్తువులను అందజేసి కాఫీ టీ పొడి ప్యాకెట్లతో పాటు ఇతర సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సుమలత, ఏవో వెంకట రవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేళ్ళవాగులో పోషణ మాసోత్సవాలు

బొల్లాపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళ్ళ వాగు గ్రామంలో ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మస్తాన్‌బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సామంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి

రొంపిచర్లలో సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ

రొంపిచర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ బాల బాలికల జట్లుకు మంగళవారం శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య తెలిపారు. శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ సెక్రటరీ సామంతరెడ్డి, పిడుగురాళ్ళ స్కాలర్ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పడాల చక్రారెడ్డి, పీసీ చైర్మన్ ఇట్టే ఏడుకొండలు, ఫిజికల్ డైరెక్టర్ సైదయ్య, మాజీ హెచ్ఎం రామకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కే-రిడ్జి విద్యార్థిని ఎంపిక


సిరి నందనను అభినందిస్తున్న చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని సిరి నందన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయిందని చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీలలో 50మీటర్లు ఫ్రీ స్టైల్, 100 మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగాలలో ఈ ఘనత సాధించిందని చెప్పారు. సిరి నందనను స్కూల్ డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

... ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ఎంపిక


సాకేత్, శివసాయిశ్రీకర్, రవికుమార్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా గోరంట్ల నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్- 19 విభాగంలో ఎస్ఎస్ఎన్ కళాశాలకు చెందిన కే సాకేత్, ఎం శివసాయిశ్రీకర్, బీ రవికుమార్ ప్రతిభచాటారన్నారు. వీరిలో కే సాకేత్ 50, 100, 200 మీటర్లు బటర్‌ఫ్లైయిలో, ఎం శివసాయిశ్రీకర్ 100 మీటర్లు ఫ్రీస్టయిల్‌ల, బీ రవికుమార్ 50, 100 మీటర్లు ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఎంపిక అయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర అంతర్ జిల్లాల అండర్-19 స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయ్‌కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, మాజీ మునిసిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, ఎండీ డాక్టర్ యక్కల మధుసూధనరావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


ముఖ్యఅతిథి కొత్తపల్లి ప్రదీప్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా తదితరులు

ఈశ్వర్‌లో సైబర్ సెక్యూరిటీపై సదస్సు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ హెరాస్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సైబర్ క్రైమ్ చీఫ్ కౌన్సెలర్ కొత్తపల్లి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ, బాలికలు, మహిళలు ఎక్కువగా సైబర్ మోసాల బారిన పడుతున్నారని అన్నారు. సైబర్ మోసం జరిగితే 1930కి ఫోన్ చేసి గానీ, ఎన్ఎస్‌డీ పోర్టల్ వెబ్‌సైట్‌లో గానీ ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో చైర్మన్ షేక్ మీరావలి, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక


కావ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగిన రాష్ట్ర అంతర జిల్లాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థిని కే కావ్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ జట్టుకి ఎంపికయిందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 14న జరిగిన పోటీలలో కావ్య ప్రాతినిధ్యం వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించి గోల్డ్‌మెడల్ నెగ్గిందని చెప్పారు. అక్టోబరులో తమిళనాడులో జరిగే జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో రాష్ట్ర జట్టుకు కావ్య ప్రాతినిధ్యం వహిస్తుందని పీడీ ఈదర ఆదిబాబు తెలిపారు. ప్రతిభ చాటిన కావ్యను ఎండీ. తిరుపతిరవు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.


సీలింగ్ ఫ్యాన్‌లు, ట్యూబ్ లైట్‌లు అందజేస్తున్న ఎంఏఎం విద్యాసంస్థల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు తదితరులు

గిరిజన బాలికల వసతి గృహానికి సీలింగ్ ఫ్యాన్ల వితరణ

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంఏఎం విద్యాసంస్థల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు జన్మదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని బాలికల గిరిజన వసతి గృహానికి సీలింగ్ ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్‌లు, లగేజ్ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు, డైరెక్టర్ దరువూరి శ్రావ్య పృథ్వీరాజ్, హాస్టల్ వార్డెన్ నాగరాజకుమారి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ సాదినేని రామారావు, నర్సింగ్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న, మేదరమెట్ల శ్రీదేవి, చావా వెంకటేశ్వర్లు, డిగ్రీ ప్రిన్సిపాల్ చంద్రారెడ్డి, ఏడుకొండలు, లక్ష్మణ్, గంటా శ్రీను, హనుమంతరావు, లా కాలేజీ ప్రిన్సిపాల్ బ్రహ్మం చౌదరి తదితరులు పాల్గొన్నారు.